## క్లుప్తంగా

### పూడిలో పొజిషన్ సర్టిఫికెట్ల పంపిణీ



లబ్ధిదారులకు పొజిషన్ సర్టిఫికెట్లు ఇస్తున్న నాయకులు

తొట్టంబేడు (శ్రీకాళహస్తి): మండలంలోని పూడిలో సోమవారం గ్రామ ఇన్‌చార్జ్, వైఎస్సార్‌సీపీకి చెందిన చెరకు నరసింహనాయుడు ఆధ్వర్యంలో 70 మంది లబ్దిదారులకు పొజిషన్ సర్టిఫికెట్లను అందజేశారు. ఆయన మాట్లాడుతూ, ఎమ్మెల్యే బియ్యపు మధుసూధన్ రెడ్డి ఆదేశాలతో ఈ కార్యక్రమం నిర్వహించామని, గ్రామస్తులకు అన్నివిధాలా అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో గ్రామ రెవెన్యూ అధికారి శంకరయ్య, పంచాయతీ సెక్రటరీ జనార్థన్ రెడ్డి, వెల్ఫేర్ అసిస్టెంట్ జోషి నికేతన్, గ్రామ వ్యవసాయ అధికారి కవిత, వలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

### కలంకారీ కళాకారులకు శిక్షణ



కళాకారులకు ఇస్తున్న శిక్షణ

శ్రీకాళహస్తి: తిరుపతికి చెందిన గాయత్రి ఎడ్యుకేషనల్ సొసైటీ, డీసీ హ్యాండీ క్రాఫ్ట్స్ సంయుక్త ఆధ్వర్యంలో శ్రీకాళహస్తిలో సోమవారం కలంకారీ కళాకారులకు డిజైన్ అండ్ టెక్నికల్ డెవలప్‌మెంట్ వర్క్‌షాప్ రెండవ బ్యాచ్‌ను ప్రారంభించారు. బెంగళూరుకు చెందిన మేఘా మంజునాథ్, జాతీయ అవార్డు గ్రహీత ఎం.విశ్వనాథ్ రెడ్డి 25 రోజుల పాటు కలంకారీ కళాకారులకు సరికొత్త డిజైన్లు, మెటీరియల్ ఫినిషింగ్, మార్కెటింగ్‌పై శిక్షణ ఇస్తారని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో సత్యమూర్తి, వెంకటముని, గుణశేఖర్, వెంకటేశ్వర్లు, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

### నిత్యాన్నదాన పథకానికి విరాళం



విరాళం అందజేస్తున్న బత్తిరెడ్డి, మునెమ్మ

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ దేవస్థానంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి బ్రాహ్మణపట్టుకు చెందిన బత్తిరెడ్డి, మునెమ్మ దంపతులు సోమవారం రూ.50వేల విరాళాన్ని ఆలయ అధికారులకు అందజేశారు. స్వామి అమ్మవార్ల దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో ఆలయ పండితులు ఆశీర్వచనం పలికారు.

### వేలంలో రూ.1.29లక్షల ఆదాయం



పోలీస్ స్టేషన్ వద్ద వేలం నిర్వహిస్తున్న పోలీసులు

సత్యవేడు: పోలీస్ స్టేషన్ వద్ద నిర్వహించిన ద్విచక్రవాహనాల వేలంలో 1,29,200 రూపాయలు ఆదాయం వచ్చినట్లు ఎస్‌ఐ పురుషోత్తం రెడ్డి తెలిపారు. సోమవారం తిరుపతి అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ శ్రీనివాసులరావు ఆధ్వర్యంలో బహిరంగ వేలం నిర్వహించారు. వివిధ కేసుల్లో సీజ్ చేసిన వాహనాల వేలంలో డిపాజిట్ చెల్లించిన పాటదారులు పాల్గొన్నారు.

### పది ఫెయిల్ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ

బుచ్చినాయుడుకండ్రిగ:న పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థులకు ఉపాధ్యాయులతో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ, ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నట్టు ఎంఈఓ రవీంద్రనాథ్ తెలిపారు. సోమవారం స్థానిక జెడ్పీ హైస్కూలులో పది ఫెయిల్ విద్యార్థుల ప్రత్యేక తరగతులను ఆయన పరిశీలించి మాట్లాడారు. సప్లిమెంటరీ పరీక్షల్లో అందరూ ఉత్తీర్ణులయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు విజయకుమారి, టీచర్లు పాల్గొన్నారు.

### డ్రోన్‌తో పురుగు మందుల పిచికారీపై అవగాహన



బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో పల్లమాల గ్రామ పొలాలలో సోమవారం మండల వ్యవసాయాధికారిణి భారతి పంటలలో పురుగుల నివారణకు డ్రోన్‌తో పురుగు మందుల పిచికారీపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ వరి, వేరుశనగ, మిరప ఉద్యానవన పంటలకు ఎకరాకు డ్రోన్ ద్వారా ఐదు నిమిషాల్లో పిచికారీ చేయవచ్చన్నారు. రాయితీపై డ్రోన్లను ప్రభుత్వం ఇస్తోందని, దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు జొన్నల గోపాల్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

# ఇళ్ల స్థలాలను శ్మశానాలతో పోల్చడం దుర్మార్గం

- శ్రీకాళహస్తి, సత్యవేడు ఎమ్మెల్యేల ఆగ్రహం
- చంద్రబాబునాయుడు వ్యాఖ్యలపై భగ్గుమన్న వైఎస్సార్ సీపీ శ్రేణులు



శ్రీకాళహస్తి : ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి నేతృత్వంలో నిర్వహిస్తున్న ర్యాలీ

శ్రీకాళహస్తి/నారాయణవనం: పేదలకు ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్ల స్థలాలను ప్రతిపక్ష నేత, మాజీ సీఎం చంద్రబాబునాయుడు శ్మశానాలతో పోల్చడం దుర్మార్గమని శ్రీకాళహస్తి, సత్యవేడు ఎమ్మెల్యేలు బియ్యపు మధుసూదన్‌రెడ్డి, కోనేటి ఆదిమూలం నిరసించారు. చంద్రబాబు వ్యాఖ్యలను ఖండిస్తూ సోమవారం శ్రీకాళహస్తిలో జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల నుంచి నాలుగు మాడవీధుల మీదుగా పార్టీ కార్యాలయం వరకు, నారాయణవనంలో వైఎస్సార్ సర్కిల్ నుంచి మండల కాంప్లెక్స్ మోటార్ సైకిళ్ల ర్యాలీ ఎమ్మెల్యేల నేతృత్వంలో నిర్వహించారు. వారు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు ఎంతో ప్రతిష్టాత్మకంగా ఇంటి స్థలాలు ఇచ్చారన్నారు.14 ఏళ్ల పాటు సీఎంగా పనిచేసిన చంద్రబాబు అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చిన దాఖలాలు లేవని, అంతా టీడీపీ నాయకుల సిఫార్సులతో పార్టీ అనుయాయులు, కార్యకర్తలకే ఇచ్చారని దుయ్యబట్టారు. అత్యధిక ప్రజాదరణతో అధికారంలోకి వచ్చిన జగనన్న స్థలాలను సేకరించి పేదలకు పంపిణీ చేస్తుంటే ఓర్వలేకనే చంద్రబాబు కువిమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. ఆయనకు ప్రజలే గుణపాఠం చెబుతారన్నారు. కార్యక్రమంలో శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, నాయకులు ఉన్నం వాసునాయుడు, కోవి చంద్రయ్య నాయుడు, వయ్యాల కృష్ణారెడ్డి,మున్నా, జయశ్యామ్, వెంకీ, పాలమంగళం రవి, మధురెడ్డి, అర్కాడు శంకర్, నాని, గోరా, హరి నాయుడు, యుగంధర్‌రెడ్డి, సుధ, జగదీశ్వరయ్య, పులి రామచంద్ర, ఆర్కాడు హేమంత, కార్తీక, పసల కృష్ణయ్య, షబ్బీర్, శ్రీనివాసులు, సతీష్, అబ్బు, షరీఫ్, ప్రభాకర్, మాజీ ఎంపీపీ సుదర్శన రెడ్డి, నారాయవణం మండల కన్వీనర్ సొరకాయలు, జేసీఎస్ కన్వీనర్ కోనేటి బాబు, పార్టీ నాయకులు ఏకాంబరం, అన్నాదొరై, కార్యకర్తలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.





శ్రీకాళహస్తిలో పార్టీ నాయకులు, కార్యకర్తల మోటార్ సైకిళ్ల ర్యాలీ

**వరదయ్యపాళెంలో..**

వరదయ్యపాళెం: కడూరు నుంచి వరదయ్యపాళెంలో వైఎస్సార్ విగ్రహం వరకు బైకు ర్యాలీ నిర్వహించారు. పార్టీ మండల కన్వీనర్ నాయుడు దయాకర్ రెడ్డి మాట్లాడారు. ప్రతిపక్ష నేత చంద్రబాబు చేసిన అనుచిత వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు దామోదర్‌రెడ్డి, దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ బొప్పన తిలక్‌బాబు, సింగిల్ విండో చైర్మన్ హరిబాబురెడ్డి, జేసీఎస్ కన్వీనర్ చిన్నా, మండల యూత్ కన్వీనర్ వినోద్ యాదవ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు సునీల్, వీరస్వామి, బుజ్జమ్మ, మండల ప్రధాన కార్యదర్శి నాగరాజు, నియోజకవర్గ ప్రచార కార్యదర్శి ఓడూరు ఉజ్వల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**సత్యవేడులో..**

సత్యవేడు: స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమీపం నుంచి తెలుగుగంగ కాలువ సమీపంలోని సుబ్రమణ్యస్వామి ఆలయం వరకు ఈ మోటార్ సైకిళ్ల ర్యాలీ నిర్వహించారు. పార్టీ మండల కన్వీనర్ సుశీల్‌కుమార్ రెడ్డి మాట్లాడారు. నాయకులు నిరంజన్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, ఏఎంసీ బాలాజీ రెడ్డి, మస్తాని, ఎంపీ రవి,ఆరూరు శేఖర్, గురుప్రసాద్, శ్రీనివాసులు రెడ్డి, పరంధాం, పునీత్‌కుమార్, టెంకాయల కృష్ణయ్య, ఎంపీటీసీలు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

**బుచ్చినాయుడుకండ్రిగలో..**

బుచ్చినాయుడుకండ్రిగ: స్థానిక వైఎస్సార్ విగ్రహం సర్కిల్ నుంచి బీఎన్‌కండ్రిగలోని మెయిన్‌రోడ్డు మీదుగా బైక్ ర్యాలీ నిర్వహించారు. పార్టీ మండల కన్వీనర్ అరణి విద్యానాథరెడ్డి మాట్లాడారు. ఎంపీపీ మేకల సుబ్బలక్ష్మి, సర్పంచ్ వెంకటమ్మ, సురుటుపల్లి దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యులు అజయ్‌కుమార్‌రెడ్డి, నాయకులు తులసీరామ్, ఇమామ్‌బాషా, కారణి హరిబాబు, లక్ష్మీపతిరెడ్డి, భాస్కర్ రెడ్డి, లక్ష్మీనారాయణ, వెంకటేశ్వర్లు, చెంగారెడ్డి, యువరాజ్ తదితరులు పాల్గొన్నారు.

**పిచ్చాటూరు, నాగలాపురంలో..**

పిచ్చాటూరు: స్థానిక బైపాస్‌లోని వైఎస్సార్ విగ్రహం నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కేవీ భాస్కర్ నాయుడు ఆధ్వర్యంలో మోటార్ సైకిళ్ల ర్యాలీ నిర్వహించారు. ప్రతిపక్ష నేత చంద్రబాబు వ్యాఖ్యలను నిరసించారు. పార్టీ విద్యార్థి విభాగ రాష్ట్ర కార్యదర్శి గజేంద్ర, మాజీ వైస్ ఎంపీపీ పాలపద్మనాభం, సచివాలయ మండల కన్వీనర్ తొప్పయ్య, ఎంపీటీసీ సభ్యులు రమేష్ రాజు, నాయకులు సుబ్రమణ్యం రెడ్డి, కిరణ్‌కుమార్, మోహన్, ఏసు, సుబ్బు, ఆర్ముగం రెడ్డి, బాబు రెడ్డి, వెంకటేష్, రుకేష్, చెంగల్రాయరెడ్డి, చంద్రన్, శేఖర్, శరత్, బాబు తదితరులు పాల్గొన్నారు.

**నాగలాపురంలో..**

నాగలాపురం మండల కేంద్రంలో శ్రీ వేదనారాయణ స్వామి ఆలయం నుంచి బజారు వీధి, రెడ్డి వీధి, ఈస్ట్, వెస్ట్ కాలనీలో ద్విచక్ర వాహనాల ర్యాలీ నిర్వహించారు. పార్టీ మండల కన్వీనర్ అపరంజిరాజు మాట్లాడారు. కార్యక్రమంలో వైఎస్ఆర్ టీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు ఎస్ఎం సురేష్, నాయకులు శ్యామ్, చిరంజీవి, దేశయ్య, సురేష్, దేశప్ప, ఈశ్వర్, డానియేల్, జేమ్స్, మునస్వామి, మధన్, రఘు తదితరులు పాల్గొన్నారు.

**కేవీబీపురంలో..**

కేవీబీపురం : పార్టీ సీనియర్ నేత నందకుమార్ నేతృత్వంలో నాయకులు, కార్యకర్తలు కేవీబీపురం నుంచి పవనివారి కండ్రిగ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. నాయకులు హరిబాబు, బాల, నాగయ్య, ఎస్సీ సెల్ మండల కన్వీనర్ అరుల్, జాకీర్, రాజేష్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.



వరదయ్యపాళెంలో..



సత్యవేడులో..



బీఎన్‌కండ్రిగలో..



నాగలాపురంలో..



పిచ్చాటూరులో..

# సమష్టిగా కృషి చేస్తేనే అభివృద్ధి

నారాయణవనం: సమష్టిగా కృషి చేస్తే అభివృద్ధి లక్ష్యాలను సాధించగలమని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. సోమవారం ఎంపీపీ దివాకర్ రెడ్డి అధ్యక్షతన మండల పరిషత్ సాధారణ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రతి రోజూ ప్రజాప్రతినిధులు మండల స్థాయి అధికారులను కలుస్తూ, సమస్యలపై చర్చిస్తే పరిష్కార మార్గాలు కనిపిస్తాయన్నారు. ప్రతి చిన్న పనికి తననో, పార్టీ పెద్దలో మాట్లాడే పరిస్థితిని ఇకపై కల్పించవద్దని ఆయన హితవు పలికారు. అధికారులు, క్షేత్ర స్థాయి ఉద్యోగులతో కలిసి ప్రజాప్రతినిధులు పనిచేస్తేనే సమస్యలపై అవగాహన పెరుగుతుందని, ఆరోపణలు చేసినంత మాత్రాన పనులు జరగవన్నారు. సచివాలయ నిధులతో చేసిన పనులకు బిల్లుల చెల్లింపులు ఆలస్యంపై ఎమ్మెల్యే అసహనం వ్యక్తం చేశారు. పనిచేయడానికి ఇబ్బందిగా ఉండే అధికారులు బదిలీపై వెళ్లిపోవచ్చన్నారు. ఎంపీపీ, జెడ్పీ ఫైనాన్స్ కమిటీ సభ్యుడు సుమన్, మాజీ ఎంపీపీ సుదర్శనరెడ్డి తదితరులు మాట్లాడారు. పదో తరగతిలో జిల్లా టాప్ పదిలో నిలిచిన షణ్ముఖనాథన్ జ్యోత్స్న, మౌనికలను శాలువ కప్పి సన్మానించారు. సమావేశంలో ఎంపీడీఓ గుణశేఖర్, తహసీల్దార్ ప్రమీల, డీఈలు దామోదరనాయుడు, ప్రభాకర్‌రెడ్డి, వివిధ శాఖల మండల స్థాయి అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, సచివాలయ కార్యదర్శులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

# గోవిందవరంలో 'ఫ్యామిలీ డాక్టర్'

ఏర్పేడు: మండలంలోని గోవిందవరంలో సోమవారం పాపానాయుడుపేట పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 102 మంది రోగులకు బీపీ, షుగర్, రక్త పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. వ్యక్తిగత శుభ్రత, సంపూర్ణ ఆరోగ్యం కోసం తీసుకోవాల్సిన ఆహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్లు అభిజ్ఞ, సాయి హరిణి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ అభిజ్ఞ

# సంక్షేమ వారధులను గౌరవిద్దాం



నారాయణవనం : వలంటీర్లతో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తదితరులు

నారాయణవనం: పార్టీలకు, కులమతాలకతీతంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలను గడప గడపకు అందిస్తున్న వలంటీర్లను గౌరవించడం మన బాధ్యతగా గుర్తించాలని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. సోమవారం ఉదయం మండలంలోని 172 మంది వలంటీర్లను ఎమ్మెల్యే చేతుల మీదుగా సన్మానించారు. శాలువలు కప్పి ప్రశంసా పత్రాలను అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రతి నెలా తెల్లవారుజామునే సామాజిక పింఛన్లను ఠంచను తప్పకుండా లబ్ధిదారులకు వలంటీర్లు అందజేస్తున్నారని, వారి సేవలను అవ్వాతాతలు నిండు మనస్సుతో ఆశీర్వదిస్తున్నారన్నారు. గ్రామంలో ఎవరైనా ఇబ్బందుల్లో ఉంటే వేరే ప్రాంతాలకు సైతం వెళ్లి పింఛన్ అందించి సేవాగుణాన్ని చాటుకుంటున్నారని అన్నారు. వీరి సేవలకు గుర్తింపుగా ప్రభుత్వం పురస్కారాలతో సత్కరిస్తోందని అన్నారు. జెడ్పీ ఫైనాన్స్ కమిటీ సభ్యుడు కోనేటి సుమన్‌కుమార్, ఎంపీపీ దివాకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ సుదర్శనరెడ్డి తదితరులు వలంటీర్ల సేవలను కొనియాడారు. తొలుత వజ్ర సేవా అవార్డును పొందిన వలంటీర్‌కు శాలువ కప్పి మెడల్‌ను, ప్రశంసా పత్రాన్ని ఎమ్మెల్యే అందజేశారు. 12 సచివాలయాల పరిధిలోని సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు సంబంధిత వలంటీర్లను సన్మానించారు. అనంతరం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గుణశేఖర్, తహసీల్దార్ ప్రమీల, మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కన్వీనర్ సొరకాయలు, జేసీఎస్ మండల కన్వీనర్ కోనేటి బాబు, ఏకాంబరం, అన్నాదొరై, పళణిరెడ్డి, వైస్ ఎంపీపీలు హేమమ్మ, శివశంకర్, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కేవీబీపురంలో వలంటీర్లను సన్మానిస్తున్న ఎమ్మెల్యే

**కేవీబీపురంలో..**

కేవీబీపురం: మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం వలంటీర్లను ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ఘనంగా సన్మానించారు. వారి సేవలను కొనియాడారు. ఆదవరం, వేమలపూడి వలంటీర్లకు ఎమ్మెల్యే మెడల్‌తోపాటు ప్రశంసా పత్రాలను అందజేసి సత్కరించారు. ఎంపీడీఓ రామచంద్ర, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు బొర్రా మాధవీరెడ్డి, పార్టీ ముఖ్యనేతలు నందకుమార్, లాల్‌బాబు యాదవ్, శాస్త్రిరాజు, ఎంపీటీసీ అయప్ప ,సర్పంచ్ గిరి,ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

### క్రీడలతో మానసికోల్లాసం

ఏర్పేడు: క్రీడలతో శారీరక, మానసికోల్లాసం కలుగుతుందని యువనేస్తం అసోసియేషన్ వ్యవస్థాపకుడు మునిశేఖర్ అన్నారు. అసోసియేషన్ మూడవ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం మండలంలోని రాజులపాలెం ఎస్టీ కాలనీలో విద్యార్థులకు మ్యూజికల్ చైర్స్, రన్నింగ్, ఖో-ఖో పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వలంటీర్ గురవమ్మ పాల్గొన్నారు.

### మొక్కలు నాటారు

ఏర్పేడు: మండలంలోని పాతవీరాపురం ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో యువ సమాజ్ నిర్మాణ్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులు మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరూ ఇళ్ల వద్ద మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. చెట్ల వల్ల కలిగే ప్రయోజనాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు.

### జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించరూ!

-ఆర్డీఓకు వినతి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం ఆర్డీవో వినతిపత్రం అందజేశారు. అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడేషన్లు మంజూరు చేయాలని, ఇళ్ల స్థలాలు కేటాయించాలని, పెన్షన్ సౌకర్యం కూడా కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కార్మిక బీమా విలేకరులకు వర్తింపజేయాలని కోరారు. కార్యక్రమంలో రహంతుల్లా, శ్రీరాములు, కామేష్, జయశ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

### పాలవెల్లువతో పెరిగిన ధర

నారాయణవనం: జగనన్న పాలవెల్లువ పథకంలో భాగంగా అమూల్ డెయిరీకి పాడి పెరిగిన పాల సరఫరాతో ధరలు పెరిగాయని హర్షం వ్యక్తం చేశారు. సోమవారం సాయంత్రం స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో ఏపీఎం మమత అధ్యతన సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ గుణశేఖర్ మాట్లాడుతూ, అమూల్ కంపెనీ లీటరు ఆవుపాలకు రూ 41, బర్రె పాలకు రూ 90 చెల్లిస్తోందన్నారు. బ్యాంకర్లతో మాట్లాడి గ్రామాల్లో మినీ డెయిరీలను రైతులతో ఏర్పాటు చేయిస్తున్నట్లు తెలిపారు. వెలుగు సీసీలు, సంఘమిత్రలు తమ పరిధిలో మహిళలను పాడిపై శ్రద్ధ వహించేలా ప్రోత్సహించాలని, అవసరమైన వారికి బ్యాంకు రుణాలను మంజూరు చేయించాలని సూచించారు. మమత మాట్లాడుతూ, పాలమంగళం గ్రామీణ బ్యాంకు పరిధిలో 15 మినీ డెయిరీల ఏర్పాటుకు కృషి చేశామని అన్నారు. కార్యక్రమంలో పశు వైద్యాధికారులు భార్గవి, కుమార్ మాట్లాడారు. సమావేశంలో అమూల్ ప్రతినిధులు, సీసీలు, సంఘమిత్రలు పాల్గొన్నారు.

### విధులకు భంగం కలిగించిన వ్యక్తి కుటుంబంపై కేసు

తొట్టంబేడు(శ్రీకాళహస్తి): రెవెన్యూ అధికారుల విధులకు భంగం కలిగించడమే కాకుండా తమను వ్యక్తిగతంగా దూషించారంటూ తొట్టంబేడు తహసీల్దార్ ఎర్రంరెడ్డి సుధీర్ రెడ్డి సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు..మండలంలో బోనుపల్లెలో రోడ్డు ఆక్రమణకు గురవుతున్నట్లు రెవెన్యూ అధికారులకు పలు ఫిర్యాదులు అందడంతో సోమవారం మండల సర్వేయర్, రెవెన్యూ సిబ్బందితో కలిసి తహసీల్దార్ రోడ్డు సర్వే చేయించారు. గ్రామానికి చెందిన బత్తెయ్య, ఆయన కుటుంబ సభ్యులు రెవెన్యూ అధికారుల విధులకు అవరోధం కలిగించి, దూషణలకు దిగారు. బత్తెయ్య, ఆయన కుటుంబ సభ్యులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రాఘవేంద్ర చెప్పారు.

# నీటిని పొదుపుగా వాడుదాం



ఉపాధి హామీ సిబ్బందికి మొక్కలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ రవిరెడ్డి

సత్యవేడు: భావి తరాల కోసం మంచినీటిని పొదుపుగా వాడుకోవాలని సర్పంచ్ ఏ.రవిరెడ్డి కోరారు. సోమవారం ఆటవీశాఖ ఆధ్వర్యంలో మేరీ లైఫ్ స్టైల్ కార్యక్రమం దాసుకుప్పం పంచాయతీలో ఉపాధి హామీ పనుల ప్రాంతంలో నిర్వహించారు. పలు పంచాయతీల్లో తాగునీటిని వృథా చేస్తున్నారని, తాగునీటి పట్టుకున్న అనంతరం కొళాయిలు ఆఫ్ చేయాలని కోరారు. ఫారెస్టు అధికారి వేణుగోపాల్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పెంచాలని కోరారు. అనంతరం ఉపాధి హామీ సిబ్బందికి మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆంబాకం ఎంపీటీసీ శరవణ, ఆటవీ సిబ్బంది నాగేశ్వరరావు, ఉపాధి ఫీల్డ్ అసిస్టెట్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

### ట్యాంకర్లతో తాగునీటి సరఫరా

ఏర్పేడు: మండలంలోని పాతవీరాపురంలో సోమవారం సర్పంచ్ మంజుల ఆధ్వర్యంలో గ్రామస్తులకు ట్యాంకర్లతో తాగునీటి సరఫరా చేశారు. గ్రామంలో ప్రస్తుతం ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తుండడంతో తాగునీటి అవసరత పెరిగింది. గ్రామస్తుల వినతిపై సర్పంచ్ స్పందించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గురవారెడ్డి పాల్గొన్నారు.



ట్యాంకర్ వద్ద తాగునీటిని తీసుకువెళుతున్న మహిళలు

# పేదల ఇంట 'సంక్షేమ' వెలుగులు




ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

-శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో అర్హులైన పేదల ఇళ్లలో వెలుగులు నింపాయని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అన్నారు. సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. ఊరందూరు ఎస్టీకాలనీలో 130, అరుంధతివాడలో 20 ఇళ్లను ఎమ్మెల్యే సందర్శించారు. ప్రజలతో మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి ఊరికి పక్కనే ఉన్నా కాలనీ, అరుంధతి వాడ 30 ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోలేదన్నారు. ఇప్పుడున్న అభివృద్ధి వైఎస్ఆర్‌సీపీ వచ్చిన తరువాత చేసిందేనని స్పష్టం చేశారు. కాలువ, రోడ్ల సమస్యలు ఉన్నాయని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. వాటిని పరిష్కరిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.. సంక్షేమ పథకాల ద్వారా సుమారు రూ.2.5 కోట్ల లబ్ధి, ఇంటిపట్టాలు వంటి వాటితో సుమారు రూ.4కోట్ల లబ్ధి చేకూరిందని గ్రామస్తులు తెలిపారు. నాయకులు రంగయ్య, మురగయ్య, సంజీవయ్య, విజయ్‌కుమార్, అనిల్‌కుమార్, మనోజ్, వినోద్, నగేష్, చెంచుకృష్ణ, చంద్రారెడ్డి, విజయ భాస్కర్‌రెడ్డి, దిలీప్, పవన్, గిరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


**సంక్షేమ ఫలాలు నేరుగా ఇంటికే**



జగనన్న పాలనలో సంక్షేమ ఫలాలు ఎవరి సిఫార్సులు లేకుండా నేరుగా ఇంటికే చేరా యని, అప్పట్లో నాయకులు, జన్మభూమి కమిటీ సభ్యుల చుట్టూ తిరిగితేగానీ ఇచ్చేవారు కాదు.. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక నా ఖాతాలోనే రూ.5,59,436 అందుకున్నాను. జగనన్నకు జీవితాంతం రుణపడి ఉంటాం.

బి.శాంతి

**రూ.10లక్షల సాయం అందుకున్నా!**



జగనన్న సంక్షేమ పాలనలో పలు పథకాల లబ్ధి మాకు అందింది. 'అమ్మ ఒడి'తో ఇప్పుడు నా పిల్లలు చదువుకుంటున్నారు. జగనన్న ఇచ్చిన ఇంటి పట్టా నాకు ఆస్తిని ఇచ్చింది. ఇంతకంటే ఇంకే కావాలి?

కనుపూరి సీత

### రాష్ట్ర మంత్రి జోగి రమేష్ రాక

రేణిగుంట:మూడు రోజుల పర్యటన నిమిత్తం సోమవారం వచ్చిన రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్‌కు రేణిగుంట విమానాశ్రయంలో జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారి వెంకటేశ్వరరావు పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. అనంతరం ఆయన రోడ్డు మార్గాన తిరుమలకు వెళ్లారు. మంగళవారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకుంటారు. మధ్యాహ్నం 3గంటలకు తిరుపతి శ్రీ పద్మావతి మహిళా విశ్వ విద్యాలయంలో తిరుపతి, చిత్తూరు జిల్లాలకు చెందిన గృహనిర్మాణ శాఖ, సంబంధిత అధికారులతో సమీక్షిస్తారు. అనంతరం వడమాలపేట మండలం కాయంగుట్ట లేఅవుట్‌లో గృహనిర్మాణాలను పరిశీలిస్తారు. రాత్రి తిరుపతి పద్మావతి అతిథిగృహంలో బస చేసి 31న ఉదయం తిరుగు ప్రయాణం అవుతారని అధికారులు వెల్లడించారు.